నాక్ స్టోర్ కీపర్స్ ఉచిత శిక్షణ కోర్సులు

మాదాపూర్, ఆన్‌లైన్: నాక్ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువకుల కోసం ఉచిత స్టోర్ కీపర్స్ శిక్షణ ఇస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు. కోర్సులో చేరదలిచిన వారు కనీసం 18 నుంచి 30 సంవత్సరాల వయసు లోపు వారై ఉండి డిగ్రీ పూర్తి చేసి ఉండాలన్నారు. అర్హులైన వారికి ఏప్రిల్ 7వ తేదీ నుంచి తరగతులు ప్రారంభమవుతాయి. మరిన్ని వివరాల కోసం 9885426 985, 9346180011 ఫోన్ నెంబర్‌లలో సంప్రదించవచ్చు.

గో సంరక్షణ చట్టాలు - అమలు తీరుపై సదస్సు రేపు

నల్లకుంట, ఆన్‌లైన్: భారతీయ ప్రాణిమిత్ర సంఘ్ ఆధ్వర్యంలో గో సంరక్షణ చట్టాలు - అమలుతీరు అనే అంశంపై ఆదివారం సదస్సు నిర్వహిస్తున్నట్లు సంఘ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జస్‌రాజ్ శ్రీశ్రీ మాల్, మహేష్ అగర్వాల్‌లు తెలిపారు. రాంకోఠిలోని జైన్ భవన్‌లో ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే సదస్సులో ప్రస్తుతం గోవుల పరిస్థితి, వాటి సంరక్షణకు ప్రభుత్వం రూపొందించిన చట్టాలు ఎలా అమలవుతున్నాయనే విషయంపై సదస్సులో వక్తలు క్షుప్తంగా చర్చిస్తారన్నారు. వన్యప్రాణులను కాపాడుకోవాల్సిన బాధ్యత, చట్టాలపట్ల ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ఈ తరహా సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

టీఎన్జీవో నేతలపై దాడిచేస్తే ఊరుకోం

ఆన్‌లైన్, సిటీబ్యూరో: తెలంగాణ ఉద్యమంలో క్రియాశీలంగా పనిచేస్తున్న టీఎన్జీవో కేంద్ర నాయకులపై దాడులు చేయాలని బావిస్తే, పరిణామాలు తీవ్రంగా ఉంటాయని సంఘం నగర అధ్యక్ష, కార్యదర్శులు ఆర్.రంజన, కస్తూరి వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని హెచ్చరించారు. తెలంగాణ ఉద్యమంలో కీలకభూమిక పోషిస్తున్న టీఎన్జీవో కేంద్ర నాయకులు స్వామిగౌడ్, దేవీప్రసాద్‌లపై కక్ష గట్టేందుకు కుటిలప్రయత్నాలు జరుగుతున్నాయని ఆక్షేపించారు. రెచ్చగొట్టే చర్యలు మానుకోకపోతే తెలంగాణ ఉద్యోగులు, ప్రజల ఆగ్రహానికి గురికాకతప్పదని హెచ్చరించారు. కక్ష సాధింపు చర్యలకు దిగాలనే ఆలోచన మానుకొని, తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుపై పార్లమెంట్‌లో బిల్లుపెట్టాలని కోరారు.

జిల్లా సాంఘిక సంక్షేమాధికారికి పదోన్నతి

ఆన్‌లైన్, సిటీబ్యూరో: జిల్లా సాంఘిక సంక్షేమాధికారి (అర్బన్-2)గా పనిచేస్తున్న ఎన్.మోజెస్‌కు పదోన్నతి లభించింది. డిప్యూటీ డైరెక్టర్‌గా పదోన్నతి కల్పిస్తూ వరంగల్ జిల్లా సాంఘిక సంక్షేమాధికారిగా బదిలీ చేశారు. కొన్నినెలల కిందటే పదోన్నతికి గ్రీన్‌సిగ్నల్ లభించగా, శుక్రవారం పోస్టింగ్ ఇస్తూ సాంఘిక సంక్షేమశాఖ ముఖ్యకార్యదర్శి వి.నాగిరెడ్డి ఉత్తర్వులిచ్చారు.

ప్రపంచ జల దినోత్సవం సందర్భంగా జేఎన్‌టీయూలో సదస్సు



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న రామలక్ష్మి తదితరులు

జేఎన్‌టీయూ, ఆన్‌లైన్: ప్రతి ఒక్కరూ నీటి వినియోగం పట్ల శ్రద్ధ వహించి నీటిని వృధా చేయకుండా పొదుపు చేసిన నాడే భావితరాలకు నీరు మిగులుతుంది. లేదా భూగర్భ జలాలు ఎండి పోయే ప్రమాదం ఉందని ఫారెస్టు అకాడమీ డైరెక్టర్ జనరల్ ఐఏఎస్ అధికారి సీఎస్ రామలక్ష్మి అన్నారు. ప్రపంచ జల దినోత్సవం సందర్భంగా శుక్రవారం జేఎన్‌టీయూ సెంటర్ ఫర్ ఎన్విరాన్‌మెంట్ విభాగం ఆధ్వర్యంలో ఐఎన్‌టీ సెమినార్ హాల్‌లో ఏర్పాటు చేసిన కమ్యూనికేటింగ్ వాటర్ క్వాలిటీ చాలెంజింగ్ అండ్ ఆపర్చ్యునిటీస్ అనే సదస్సుకు రామలక్ష్మి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పురాతన కాలంలో గ్రామాల్లో మంచినీటి కొలనులు, బావులు, ఉండేవి. నేడు ప్రతి కోట బోర్లు, ఒక ఎకరం పొలం వుంటే ఒక బావితో సరిపోయేది అప్పుడు. అదే ఇప్పుడు ఎకరం స్థలంలో సుమారు 15 బోర్లు వేస్తున్నారు. భూగర్భజలాలపై వీటి ప్రభావం ఎంతగానో వుంటుందని పర్యావరణ వేత్తలు అంటున్నారని అన్నారు. గతంలో మన దేశంలో ప్రవహించే కృష్ణ, గంగా, యమున, గోదావరి నదులలోని నీరు ప్రజల దాహార్తిని తీర్చేవి. ఇప్పుడు నీళ్ల కలుషితమవుతున్నాయి. తాగటానికి కాదు కదా వాడుకోవడానికి పనికి రాకుండ పోతున్నాయి. వీటికి మానవాళి నిర్లక్ష్యమే ప్రధాన కారణం. నదులు మంచి నీరు ఇస్తాయని వాటి మేలు తీర్చుకోనిది కాదంటూ మన పూర్వీకులు పసుపు, కుంకుమలు సమర్పించి దైవంలా పూజించేవారు. కాని మనం నదులలో చెత్తా చెదారం, ప్లాస్టిక్ కవర్లు, మురుగు కాలువలు కలుపుతూ కలుషితం చేస్తున్నామన్నారు. వర్షపు నీటిని వృధాగా పోనివ్వకుండా ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకుని వీటిని రీసైక్లింగ్ విధానం ద్వారా శుభ్రపరిచి తిరిగి వినియోగించకోవడం ద్వారా భూగర్భ జలాలను పెంపొందించవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో నీటిని పొదుపుగా వాడుతామని సదస్సులో పాల్గొన్న వారు ప్రతిజ్ఞ చేయడం విశేషం. ఈ కార్యక్రమంలో ఐఎస్‌టీ డైరెక్టర్ లక్ష్మీనర్సు, ఎన్విరాన్‌మెంట్ విభాగం ప్రొఫెసర్ హిమబిందు, ప్రకాశం టాటా, మంగపతి రావు తదితరులు పాల్గొన్నారు.

భక్తి పారవశ్యంలో ముంచెత్తిన అన్నమయ్య సంకీర్తనలు

సంకీర్తనలు ఆలపిస్తున్న పద్మశ్రీ డాక్టర్ శోభారాజ్

హరిహర కళాభవన్, ఆన్‌లైన్: కొండలలో నెలకొన్న కోనేటి రాయడు వాడు... హరి అవతారమే అన్నమయ్య రూపము.... ఓం, నారాయణాయ నమో: కీర్తనలు ప్రేక్షకులను భక్తిపారవశ్యంలో ముంచెత్తాయి. దక్షిణమధ్యరైల్వే ఆంధ్రలలిత కళాసమితి ఆధ్వర్యంలో రైల్‌నిలయం ఆడిటోరియంలో శుక్రవారం అన్నమయ్య పద శోభ పేరిట విభావరి జరిగింది. పద్మశ్రీ డాక్టర్ శోభారాజ్ తొలి తెలుగు వాగ్గేయకారుడు అన్నమయ్య రచించిన సంకీర్తనలు రాగ భావయుక్తంగా గానం చేశారు. 'కొండలలో నెలకొన్న కోనేటి రాయడు' సంకీర్తనకు ఆహూతులు కరతాళధ్వనులు చేశారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన రైల్వే సీపీవో మనోజ్‌పాండే జ్యోతి ప్రజ్వలన చేసి మాట్లాడుతూ సంగీతంతో మనశ్శాంతి లభిస్తుందన్నారు. 32 వేల సంకీర్తనలు రచించి గానం చేసిన అన్నమయ్య తెలుగువారు కావడం గర్వకారణమని సమితి అధ్యక్షుడు గణేశ్వరరావు అన్నారు. శోభారాజ్‌తో కలిసి జ్యోత్స్న సింధూర సంకీర్తనలు ఆలపించారు. సమితి కార్యదర్శి కేవీ బాలాజీ రావు వందన సమర్పణ చేశారు. ఈ కార్యక్రమంలో భైరి సత్యనారాయణ, కృష్ణమోహన్, ఎస్.రాజు, నెమలికంటి అరుణ, కిషన్‌రావు పాల్గొన్నారు.

పెయింటింగ్, డ్రాయింగ్ వర్క్‌షాప్ 29 నుంచి

నల్లకుంట, ఆన్‌లైన్: సిరి పెయింటింగ్ ఇన్‌స్టిట్యూట్ ఆధ్వర్యంలో పెయింటింగ్, డ్రాయింగ్ పట్ల అవగాహన కల్పించేందుకు ఈ నెల 29వ తేదీ నుంచి వర్క్‌షాప్‌ను నిర్వహిస్తున్నట్లు ఇన్‌స్టిట్యూట్ డైరెక్టర్ స్వామి తెలిపారు.

శుక్రవారం హైదర్‌గూడ ఎన్ఎస్ఎస్‌లో విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పెయింటింగ్, డ్రాయింగ్ పట్ల ఆసక్తి ఉన్నవారిని ప్రోత్సహించి వారిలోని ప్రతిభను వెలికితీసేందుకే 29వ తేదీనుంచి 4 రోజుల పాటు వర్క్‌షాప్ హిమాయతీనగర్, బంజారాహిల్స్‌లోని ఇన్‌స్టిట్యూట్ కార్యాలయాలలో జరుగుతుందని తెలిపారు. పెయింటింగ్ విభాగంలో పాల్గొనాలనుకునేవారు 14 సంవత్సరాల పైబడి ఉండాలని, మెటీరియల్ వ్యయం నిమిత్తం 2వెయ్యిరూపాయలు చెల్లించాల్సి ఉంటుందన్నారు. డ్రాయింగ్ వర్క్‌షాప్‌లో పాల్గొనాలనుకునేవారు 5 సంవత్సరాలు దాటి ఉండాలని మెటీరియల్ ఇన్వెస్ట్‌మెంట్‌కోసం 5 వందల రూపాయలు చెల్లించాలన్నారు. ఇతర వివరాలకు 9849419642, 9949887211 నెంబర్లలో సంప్రదించాలని సూచించారు. సమావేశంలో ఇన్‌స్టిట్యూట్ ప్రతినిధి శివకుమారి పాల్గొన్నారు.

బృహత్ కవితా సంకలనం ఆవిష్కరణ

బర్కత్‌పుర, ఆన్‌లైన్: సామాజిక జీవన స్పందన, స్త్రీ జీవితంలో ఉండాల్సిన లక్షణాలకు చక్కని నిదర్శనం శీలా సుభద్రాదేవి రచనలని తెలుగు యూనివర్సిటీ పూర్వ ఉపాధ్యక్షులు ఆచార్య ఎన్.గోపి అన్నారు. ఈ రచనలు భావితరాలకు మార్గదర్శకం కావాలని ఆయన కోరారు. శుక్రవారం రాత్రి బషీర్‌బాగ్ ప్రెస్క్లబ్‌లో శీలా సుభద్రాదేవి 1975 నుంచి 2009 వరకు రచించిన కవితలను 'బృహత్ కవిత' పేరుతో ముద్రించిన సంకలనాన్ని ఆచార్య ఎన్.గోపి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాలుగు దశాబ్దాల సామాజిక పరిణామాలను మానవీయ కోణంలో రాసిన గ్రంథమని కొనియాడారు. మహిళా జీవితాన్ని తమ రచనలలో సుభద్రాదేవి పొందుపరిచారని ఆయన అన్నారు. సామాజిక జీవన స్పందన, సంచేదం, సంభాషణ ఆమె రచనలలో ముఖ్యంగా కనిపిస్తుందని ఆయన అన్నారు.

విరసం సభ్యురాలు రత్నమాల పుస్తక పరిచయం చేస్తూ స్త్రీ ఉనికి కోల్పోతున్న నేపథ్యంలో గృహిణుల హృదయ స్పందన అంతరించిపోతున్న బాల్యం గురించి ఈ పుస్తకంలో వివరించారని ఆమె అన్నారు. శాస్త్రీయ అవగాహన చక్కటి రచనలను సాహిత్యాన్ని ఈ పుస్తకం ద్వారా సమాజానికి అందించారన్నారు. ప్రముఖ రచయిత డాక్టర్ రాగేశ్వరం శంకరం అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో పుస్తక రచయిత్రి శీలా సుభద్రాదేవి తదితరులు పాల్గొన్నారు.

శ్యాం పిట్రోడా సిఫారసులను ఉపసంహరించుకోకుంటే 20 నుంచి నిరవధిక సమ్మె: బీఎస్ఎన్ఎల్ జేఏసీ

ఆఫీడ్స్‌లోని బీఎస్ఎన్ఎల్ సీజీఎం కార్యాలయం ఎదుట జేఏసీ నాయకుల ధర్నా

ఆన్‌లైన్, సిటీబ్యూరో: ప్రధాని సలహాదారు శ్యాం పిట్రోడా సిఫారసులను ఉపసంహరించుకోకుంటే ఏప్రిల్ 20 నుంచి దేశ వ్యాప్తంగా నిరవధిక సమ్మె చేస్తామని బీఎస్ఎన్ఎల్ జేఏసీ నేతలు హెచ్చరించారు. బీఎస్ఎన్ఎల్ ఎగ్జిక్యూటివ్, నాన్ ఎగ్జిక్యూటివ్ యూనియన్ల జేఏసీ ఆధ్వర్యంలో ఆఫీడ్స్‌లోని చీఫ్ జనరల్ మేనేజర్ కార్యాలయంలో, ఆదర్శనగర్‌లోని ప్రిన్సిపల్ జనరల్ మేనేజర్ కార్యాలయాల వద్ద శుక్రవారం మధ్యాహ్నం 1.30 గంటలకు పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు.

పీజీఎం కార్యాలయం వద్ద నిర్వహించిన సమావేశంలో బీఎస్ఎన్ఎల్ జేఏసీ చైర్మన్ ఎ.రాజమౌళి, కన్వీనర్ సంపతీరావు మాట్లాడుతూ బీఎస్ఎన్ఎల్‌కు కావాల్సిన సామాగ్రిని ఇస్తే తమ సంస్థను ప్రథమ స్థానంలో నిలుపుతామన్నారు. బీఎస్ఎన్ఎల్‌ను ప్రైవేట్ పెట్టుబడిదారులకు అప్పచెప్పే లక్ష్యంతోనే శ్యాం పిట్రోడా సిఫారసులు చేశారని, ఆ సిఫారసులను వెంటనే ఉపసంహరించుకోవాలని వారు డిమాండ్ చేశారు. బీఎస్ఎన్ఎల్‌లో లక్ష మంది ఉద్యోగులకు వీఆర్ఎస్ ఇచ్చి తొలగించాలనే సిఫారసులను తొలగించాలనీ, ప్రైవేటీకరణ ప్రతిపాదనలను తొలగించాలనీ, ఐటీఎస్ అధికారులను బీఎస్ఎన్ఎల్‌లో విలీనం చేయాలని వారు డిమాండ్ చేశారు. శ్యాం పిట్రోడా సిఫారసులను ఉపసంహరించుకోకుంటే దేశవ్యాప్తంగా ఉన్న మూడు లక్షల మంది బీఎస్ఎన్ఎల్ ఉద్యోగులు ఒక్కొక్కరు ఇచ్చే ఒక్క బాటిల్ రక్తంతో ప్రజాప్రతినిధుల ఇళ్ల గడపలను కడుగుతామన్నారు. ఈ సమావేశంలో జేఏసీ నేతలు కె.జయప్రకాశ్, ఎస్.రాంబాబు, జె.సాయిబాబా, బాలకృష్ణ, పద్మనాభరావు, తారానాథ్ తదితరులు మాట్లాడారు.

వివిధ రంగాల వారికి ఆదర్శ మహిళా పురస్కారాల ప్రదానం

చిక్కడపల్లి, ఆన్‌లైన్: యువ ఆర్ట్ థియేటర్స్ ఆధ్వర్యంలో సిటీసెంట్రల్ లైబ్రరీ ఓపెన్ ఆడిటోరియంలో వివిధ రంగాల మహిళా ప్రముఖులకు ఆదర్శ మహిళా పురస్కారాల ప్రదాన కార్యక్రమం వేడుకగా జరిగింది. ఈ సందర్భంగా గాంధీనగర్ కార్పొరేటర్ ముఠాపద్మ నరేష్, సినీనటి జయలక్ష్మి, జ్యోతిష్యరంగ ప్రముఖురాలు డాక్టర్ ఈడ్పుగంటి పద్మజారాణి, ప్రముఖ వైద్యుడు డాక్టర్ కిరణ్ ద్వారకనాథ్, లయన్ చంద్ర, కాంగ్రెస్ మహిళా విభాగం కార్యదర్శి సూరజ్ యాజ్‌దాని, లయన్ స్వర్లత, డాక్టర్ పద్మజ, శైలజా సుధాకర్, కృష్ణకుమారి, అల్లి బిల్లి సినిమాటిక్ ఫొటోఆల్బమ్ నిర్మాత పి.మంజుల, లయన్ కమల, ఎ.సుజాత, జి.కె.యమునశ్రీలకు పురస్కారాలను లయన్ బి.చంద్రకాంతారావ్, లయన్ కె.సాయికుమార్ రెడ్డి, హైకోర్టు న్యాయవాది వెంకటేశ్వరులు ప్రదానం చేశారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాలలో ముందు ఉంటున్నారని వారిని పురుషులు ప్రోత్సహించాలన్నారు. కార్యక్రమంలో దైవజ్ఞశర్మ, సోమయ్య, జి.కె.రమణ, విజయకుమార్, కబలవాలు కేశవరావు, బి.ఆర్.వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు. రాజనాల సత్య బృందం సందడేసందడి కామిడీ మిర్చి కార్యక్రమాన్ని ఆకట్టుకునేలా నిర్వహించారు.

ఘనంగా ఘంటసాల స్వర రాగ మహాయాగం

చిక్కడపల్లి, ఆన్‌లైన్: 51 రోజుల ఘంటసాల స్వరరాగ మహాయాగం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం రాత్రి త్యాగరాయ గానసభలో నిర్వహించిన గాయనీగాయకుల గానహేల కార్యక్రమం ఘనంగా సాగింది. చంద్రతేజ, వీవీ రామారావు, గీతాంజలి, మణిశాస్త్రిలు ఆలపించిన 51 ఘంటసాల గీతాలు శ్రోతలిరిపిన ప్రేక్షకులను అలరించాయి. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా పాల్గొన్న సభా సమ్రాట్ కె.వి.భాస్కర్‌రావు, ప్రముఖ కవి డాక్టర్ జె.బాపురెడ్డి, అమెరికాకు చెందిన హరికృష్ణ ఇప్పనపల్లి, ఎన్.బుచ్చిబాబులను నిర్వాహకుడు వంశీ రామరాజు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా బాపురెడ్డి మాట్లాడుతూ అమృత కంఠుడు ఘంటసాల అని అన్నారు. ఈ కార్యక్రమంలో తెన్నేటి సుధాదేవి, ధర్మారావు, శైలజారాణి సుంకరపల్లి, సుధామయి తదితరులు పాల్గొన్నారు.

భావ కవిత్వానికి ఆద్యుడు రాయప్రోలు: ద్వా.నా.శాస్త్రి

చిక్కడపల్లి, ఆన్‌లైన్: తెలుగుసాహిత్యాన్ని సుసంపన్నం చేసిన రాయప్రోలు సుబ్బారావు భావకవిత్వానికి ఆద్యుడని సుప్రసిద్ధ సాహితీవేత్త డాక్టర్ ద్వానాశాస్త్రి అన్నారు. వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి కళాసుబ్బారావు కళావేదికలో యుగకర్త రాయప్రోలు సుబ్బారావు గురించి ద్వానాశాస్త్రి ప్రసంగిస్తూ రాయప్రోలు అనేక కావ్యాలు రచించి తెలుగుసాహిత్యంలోని మాధుర్యాన్ని ప్రపంచానికి చాటారని అన్నారు. ఆయన దేవులపల్లి కృష్ణశాస్త్రి సమకాలీకుడని అన్నారు. సాహితీవేత్త ఆచార్య ఎం.కులశేఖర్‌రావు మాట్లాడుతూ రాయప్రోలు సుబ్బారావు రచనలు చిరకాలం ఆంధ్రదేశాన్ని ఆకట్టుకుంటాయన్నారు. భావకవిత్వం గురించి విపులంగా రచించి నేటి సాహితీవేత్తలకు ఆదర్శంగా నిలిచాడని కొనియాడారు. ఈ కార్యక్రమంలో వంశీ రామరాజు, డాక్టర్ తెన్నేటిసుధాదేవి, వంశీధర్మారావు తదితరులు పాల్గొన్నారు.